www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 12 అక్టోబర్ 2023 5 కాకినాడ

రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు చరణ్ ఎంపిక

ప్రజాశక్తి - కరప

కరప నక్కా సూర్యనారాయణమూర్తి జడ్పి హై స్కూల్లో ఏడో తరగతి విద్యార్థి వాసంశెట్టి మహాసత్యసాయిచరణ్ రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్ఎం లీలా మనోహర్ తెలిపారు. కాకినాడ జిల్లా క్రీడామైదానంలో నిర్వహించిన అండర్-14 200 మీటర్లు, 400 మీటర్ల పరుగు పోటీల్లో చరణ్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి అర్హత సాధించాడు. ఈ సందర్భంగా సాయిచరణ్‌ను ఎఎంసి చైర్మన్ రమాదేవి, సర్పంచ్ ఆకాజ్యోతి, జడ్పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి, ఎంఇఒ బి.కృష్ణవేణి, పీడీ కె.శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

కౌలు చట్టం సవరణ కోసం పోరాటం

ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి

రాష్ట్ర సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సదస్సులో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

సదస్సులో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్, ఎంఎల్‌సి ఐవి, కారెం వెంకటేశ్వరరావు

సదస్సుకు హాజరైన రైతులు, కౌలు రైతులు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, అమలాపురం

కౌలు రైతులకు మేలు కలిగేలా చట్ట సవరణ చేయాలని, దీని కోసం పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం అమలాపురంలోని షాదీఖానా భవనంలో సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన కౌలు రైతుల రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సులో శ్రీనివాసరావు ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. కౌలు రైతు చట్టంలో భూ యజమాని సంతకం నిబంధన తొలగించి కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పూర్తిస్థాయిలో పంట రుణాలు అందివ్వాలని, దేవాదాయ భూముల రైతులకూ కార్డులు, రుణాలు ఇవ్వాలని, భూమిలేని ఓసి కౌలు రైతులకు కూడా రైతు భరోసా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత వ్యవసాయరంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. అప్పులతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. తీవ్ర సంక్షోభంలో ఉన్న కౌలు వ్యవసాయాన్ని ఆదుకోవాలంటే తక్షణమే వారికి కనీస గుర్తింపు ఇవ్వాల్సి ఉన్నదన్నారు. ఈ విషయంలో వైసిపి ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల రీత్యా కౌలు రైతులను ఆదుకోవడానికి చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. యజమాని సంతకం తప్పనిసరిగా ఉండాలనే నిబంధనతో గుర్తింపు కార్డులు అందడం లేదన్నారు. గతంలో మాదిరిగా అందరికీ కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతుల హక్కులు పరిరక్షణ గుర్తింపు కోసం పనిచేయకపోతే జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తామని హెచ్చరించారు. కౌలు రైతాంగ పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వ కుల రాజకీయాలు చేస్తూ కుల గణన చేయడానికి ఎందుకు వెనకడుగు వేస్తుందో చెప్పాలన్నారు. మణిపూర్‌లో కుల, మత స్వేచ్ఛను హరిస్తోందన్నారు. రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ మనువాదవ్యవస్థను అమలు చేస్తున్న మోడీ సర్కార్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా, రాజధానికి నిధులు కేటాయించకుండా అన్యాయం చేస్తున్న మోడీ సర్కార్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. రైతు స్వరాజ్య వేదిక జాతీయ నాయకులు విస్సా కిరణ్ కుమార్ మాట్లాడుతూ కోనసీమ ప్రాంతంలో కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారన్నారు. గతంలో కౌలు రైతుల సమస్యలపై క్షేత్రస్థాయిలో సర్వేలు చేయగా అనేక అంశాలు ముందుకు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,200 మంది రైతులను సర్వే చేయగా 366 మందికి (8.8 శాతం) మాత్రమే గుర్తింపు కార్డులు అందాయన్నారు. 3 శాతం మందికి మాత్రమే రైతు భరోసా అందుతుందన్నారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి వాస్తవ సాగుదారులకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తమ హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని కౌలు రైతులకు సూచించారు.. రాబోయే ఎన్నికల్లో ఓట్లు కోసం వచ్చే నాయకులను కౌలు రైతుల సమస్యలపై నిలదీయాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై పిడిఎఫ్ ఎంఎల్‌సిలు శాసనమండలిలో చర్చించామన్నారు. సిసిఆర్ కార్డులు ఇవ్వాలంటే భూ యజమాని సంతకం నిబంధన ఎందుకు పెట్టారో చెప్పాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. డ్రెయిన్లు, స్లూయిజ్‌లు మూసుకుపోయాయన్నారు. అక్రమ ఆక్వా చెరువులతో పంటలు నాశనమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు అంద్ర మాల్యాద్రి, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు, శ్రామిక మహిళా నాయకులు కె.కృష్ణవేణి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్.బలరాం, టి.నాగవరలక్ష్మి, జి.దుర్గాప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కుడిపూడి రాఘవమ్మ, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రామచంద్రరావు, జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు జి.బాబు పశ్చిమగోదావరి జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు ఎం.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇవీ ప్రత్యామ్నాయాలు...

కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి సదస్సు కొన్ని ప్రత్యామ్నాయాలను చేసింది. వీటిని ఏపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు ప్రవేశపెట్టారు. దీన్ని సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది.

- భూ యజమాని సంతకం తొలగించి గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
- కౌలు రైతులందరికీ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు, పంట నష్టపరిహారాలు, పంటలబీమా ఇవ్వాలి.
- దేవాలయ భూముల సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు ఇవ్వాలి.
- భూమిలేని ప్రతి కౌలు రైతుకి రైతు భరోసా ఇవ్వాలి.
- కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింపచేయాలి.
- కౌలు రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి.
- కేరళ తరహాలో కౌలు రైతుల రుణాలు మాఫీ చేయాలి.
- కేరళ తరహాలో అన్ని పంటలకు మద్దతు ధరలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి కొనుగోలు చేయాలి.
- కౌలు రైతుల పేరుతోనే ఈ క్రాపింగ్ చేయాలి.
- వ్యవసాయ అనుబంధ శాఖల్లో ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలి.
- ప్రాజెక్టులు, కాలువలు, పథకాలకు మెయింటెనెన్స్ నిధులు ఇవ్వాలి.
- ప్రతి మూడు నెలలకు ఒకసారి వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకర్లు, జలవనరుల శాఖలు రైతుల్లో కౌలు రైతు సంఘాలతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించాలి.
- డెల్టా ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి. సాగునీరు, మురుగు పారుదల వ్యవస్థలను మెరుగుపరచాలి.
- వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను అభివృద్ధి చేయాలి.
- వ్యవసాయ కార్మికుల, వృత్తిదారుల, ఇతర పేదల సమస్యలను పరిష్కరించాలి.

నేడు సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. గురువారం సిఎం పర్యటన నేపథ్యంలో రాష్ట్ర హౌసింగ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ముఖ్యమంత్రి పర్యటన సమన్వయకర్త తలశిల రఘురామ్, హౌసింగ్ జెఎండీ శివప్రసాద్, ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్, జెసి ఎస్.ఇలాక్కియాలతో కలిసి ఆమె ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్య మంత్రి కాన్వాయ్‌కి సంబంధించిన ట్రైల్ రన్‌ను నిర్వహించారు. పేదల సొంతింటి కల సాకారం చేసే బృహత్తర కార్యక్రమాన్ని గురువారం సామర్లకోటలో ముఖ్యమంత్రి ప్రారంభించను న్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.నరసింహ నాయక్, జిల్లా పరిషత్ సిఇఒ ఎ.రమణారెడ్డి, ఆర్‌డిఒలు ఎన్‌వివి.సత్యనారాయణ, జె.సీతా రామరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై ఆంక్షలు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్‌పై పలు ఆంక్షలు విధించారు. కాకినాడ జిల్లాలో గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు పెద్దాపురం డిఎస్‌పి లతా కుమారి తెలిపారు. కాకినాడ వైపు నుంచి సామర్లకోట వైపునకు వచ్చే భారీ వాహనాలన్నీ అచ్చంపేట జంక్షన్ నుంచి తిమ్మాపురం, పిఠాపురం బైపాస్ మీదుగా కత్తిపూడి హైవేకు దారి మళ్లించా మన్నారు. కాకినాడ, మాధవపట్నం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు ఉండూరు బ్రిడ్జి డౌన్ జంక్షన్ నుండి అచ్చంపేట బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించామన్నారు. సామర్లకోట అయిదు తూముల సెంటర్ అయ్యప్ప స్వామి గుడి దగ్గర కటాఫ్ పెట్టుకుని ఉండూరు వైపు నుంచి వచ్చే వాహనాలను మాధవపట్నం వైపునకు మళ్లిస్తున్నట్టు తెలిపారు. బిక్కవోలు, అనపర్తి వైపు నుంచి సామర్లకోట వైపుకు వచ్చే భారీ వాహనాలన్నీ బిక్కవోలు, భలభద్రపురం మీదుగా మళ్లించామన్నారు. రాజానగరం వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు పెద్దాపురం పాండవుల మెట్ట నుంచి గుర్రాల సెంటర్ మీదుగా జగ్గంపేట హైవేకు, ఆర్‌టిసి బస్సులు సామర్లకోట బస్టాండ్‌కు వచ్చి తిరిగి రైల్వే ఓవర్ బ్రిడ్జ్ మీదుగా పెద్దాపురం ఎడిబి రోడ్డు మీదుగా వెళ్తాయన్నారు. జగ్గంపేట నుంచి వచ్చే వాహనాలు ఎడిబి రోడ్డు మీదుగా కాకినాడ వైపునకు మళ్లించా మన్నారు. ప్రత్తిపాడు నుండి కాకినాడ వెళ్ళే వాహనాలు దివిలి మీదుగా కాకినాడ వైపునకు మళ్లుతాయన్నారు. కాకినాడ, కత్తిపూడి నుండి వచ్చే వాహనాలు సామర్లకోట వైపునకు రాకుండా తిమ్మాపురం, వై.జంక్షన్ నుంచి మళ్లించామన్నారు. రాజానగరం, రంగంపేట వైపు నుంచి కాకినాడ వచ్చే భారీ వాహనాలను జగ్గంపేట, కత్తిపూడి మీదుగా దారి మళ్ళించినట్టు తెలిపారు. భలభద్రపురం నుంచి సామర్లకోట వైపు వచ్చే భారీ వాహనాలను అనపర్తి, మండపేట నుంచి కాకినాడ వైపునకు మళ్లించామన్నారు.

పార్కింగ్ ప్రదేశాల కేటాయింపు

పెద్దాపురం రోడ్డులోని స్వర్ణ దేవాలయం వద్ద, పెద్దాపురం సుధా ఆయిల్ మిల్లు చెంతన హీరో షో రూమ్ పక్కన గల ఖాళీ ప్రదేశంలోనూ, జి.రాగంపేట గ్రామం గణేష్ కాలనీ పిల్లి సూరిబాబు లే ఔట్ వద్ద వాహనాలకు పార్కింగ్ ప్రాంతాలుగా కేటాయించామన్నారు. ఆటోలకు సామర్లకోట టిటిడిసి శిక్షణ కేంద్రంలో, పిఠాపురం రోడ్డు పెట్రోల్ బంక్ ఎదురుగా, సామర్లకోట ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద పార్క్ చేసుకోవాలన్నారు.

ప్లకార్డుతో నిరసన తెలుపుతున్న దూసర్లపూడి రమణరాజు

స్మార్ట్ సిటీ నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

స్మార్ట్‌సిటీ నిధులు రూ.వేయి కోట్ల దుర్వినియోగంపై దర్యాప్తు చేయించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ బుధవారం సామర్లకోట వస్తున్న సందర్భంగా కాకినాడ-సామర్లకోట రోడ్‌లో ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహించారు. సామర్లకోట రోడ్డుకిరు వైపులా కెనాల్స్ పొడవునా ఏర్పడిన భారీ ఆక్రమణలు, ఉప్పుటేరు నడుమ మేడలైన్ అక్రమ వంతెన, సముద్ర పాయలోకి చేరే కాలువ కుచించుకు పోవడం కారణంగా గోదావరి వరదల సమయంలో జిల్లా కేంద్రం ముంపునకు గురవుతుందన్నారు. 16 డివిజన్లు 8గ్రామాలు, వేల ఎకరాల పంట నీటమునుగుతుందన్నారు. రెండేళ్ల క్రితం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ దీనిపై ప్రశ్నించినా, స్థానిక పౌరులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా జిల్లా యంత్రాంగంలో ఎలాంటి కదలిక లేదన్నారు. మురుగు నీరు పారించే ప్రణాళిక లేకుండా జనరల్ నిధులు వృథా చేశారన్నారు. బాగున్న సిసి రోడ్లు మరింత ఎత్తు చేయడంతో మురుగునీరు ఇళ్లలోకి చేరుతుందన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ సిటీ నిధులు దుర్వినియోగం అయ్యాయని, తాను అధికారంలోకొస్తే వాటిపై విచారణ చేయిస్తానని 2019లో సిటీ ఎంఎల్‌ఎ హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ అమలు కాకపోగా మరింత దుర్వినియోగానికి ఆయనే కారణమయ్యారన్నారు. కార్పొరేషన్ పాలన గాడి తప్పిందన్నారు. ఈ క్రమాలపనై ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం

ప్రజాశక్తి - కాకినాడ

విద్యారంగ సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వహిస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగాసూరిబాబు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాలు గున్నరేళ్ల కాలంలోనూ విద్యారంగాన్ని గాలికివది లేసిందని తెలిపారు. ఎన్నికల ముందు అందరికీ ఉచిత విద్యనందిస్తామని చెప్పిందన్నారు. నేడు జిల్లాలో విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ముఖ్యమంత్రి సభలకు మాత్రమే విద్యాసంస్థలు పనికి వస్తున్నాయని, కాని విద్యా సంస్థల్లో సమస్యలను మాత్రం పట్టించుకోవట్లేద న్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గతేడాది నుంచి పాఠ్యపుస్తకాలను ఇవ్వట్లేదన్నారు. పుస్తకాలు లేకుండా విద్యార్థులు ఎలా చదువుతారు? అని ప్రశ్నించారు. జిల్లాలో సంక్షేమ హాస్టల్స్‌కు శాశ్వత భవనాలు లేవన్నారు. తక్షణమే హాస్టల్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు నిర్మిం చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అక్షయపాత్ర, అల్లూరి సీతారామరాజు ఏజెన్సీ ద్వారా అందిస్తున్న భోజనంలో నాణ్యత ఉండట్లేదన్నారు. మధ్యాహ్నం భోజన పథకం నిధులు పెంచి నాణ్యత గల భోజనం పెట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నిధులు అందించాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీజీ సెంటర్, జెఎన్‌టియుకెలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యారంగంలో ఉన్న సమస్యలపై నేడు సామర్లకోటలో పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి మాట్లాడాలని డిమాండ్ చేశారు.

హామీలు అమలు చేయకుండా ప్రచార ఆర్భాటాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు

పెద్దాపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి గతంలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు జరపకుండా ముఖ్యమంత్రి నియోజకవర్గ పర్యటనపై ప్రచార ఆర్భాటాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని సిపిఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అన్నారు. 2018లో ప్రతిపక్ష నాయకునిగా పెద్దాపురం మెయిన్ రోడ్‌లో జరిగిన సభలో ప్రజలకు హామీలు చేసిన ప్రాంతం, సినిమా సెంటర్, వెంకటేశ్వరస్వామి గుడి సెంటర్,డైలీ మార్కెట్ సెంటర్, వినాయకుని గుడి సెంటర్‌లో సిపిఎం నాయకులు బుధవారం కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడారు. పెద్దాపురం,సామర్లకోట మున్సిపల్ పట్టణాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు గురించి చెప్పాలన్నారు. ధవళేశ్వరం నుంచి పైపులైను ద్వారా గోదావరి మంచినీటి సరఫరా, 100 పడకల ఆసుపత్రి వంటి హామీలు ఏమయ్యాయన్నారు. డబ్బులు కట్టొద్దని టిడ్కో లబ్ధిదారులకు ఆనాడు ఇచ్చిన మాట ఏమైందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు చొరవ చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, కూనిరెడ్డి అప్పన్న, గడిగట్ల సత్తిబాబు, రొంగల వీర్రాజు, డి.కష్ణ, నెక్కల నరసింహమూర్తి, సత్యనారాయణ, హనుమంతు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యకు ఎక్స్‌లెన్స్ అవార్డులు

ప్రజాశక్తి - గండేపల్లి

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ(క్వాలిటీ అస్యూరెన్స్ సెల్) విభాగం ఆధ్వర్యంలో 'రసస్వాద' ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులు వచ్చాయని వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. మెరుగైన విద్యాప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్న న్యాక్ (ఎ, ఎ-ప్లస్, ఎ-ప్లస్ ప్లస్) గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో ర్యాంకులు సాధించిన విద్యా సంస్థల ప్రతినిధులకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అవార్డులు అందించారని సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, ఐఐఐటి శ్రీ సిటీ చిత్తూర్ చైర్మన్ ఎం.బాలసుబ్రహ్మణ్యం, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి సారథ్యంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల (న్యాక్ - ఎ-ప్లస్ ప్లస్) ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, డీన్ డాక్టర్ జి.సురేష్, ఆదిత్య ఫార్మసీ కళాశాల (న్యాక్ -ఎ) ప్రిన్సిపల్ డాక్టర్ డి.సతీష్‌కుమార్, ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాల (న్యాక్ - ఎ) బి.వైదేహి అవార్డులు అందుకున్నారు.

సిఎం సభకు ఆశా వర్కర్లు దేనికి.? : సిఐటియు

ప్రజాశక్తి - కాకినాడ

ముఖ్యమంత్రి సభకు ఆశావర్కర్లు రావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పెద్దాపురంలో సమావేశం పెట్టి పిలుపునివ్వడం సరికాదని ఆంధ్ర ప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నర్ల ఈశ్వరి, చంద్రమళ్ల పద్మ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆశాలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాల్సి ఉందన్నారు. కాని అధికారులు దగ్గరుండి మరీ రాజకీయ సభలకు పంపించడం సరికాదన్నారు. ఈ సభ కోసం పెద్దాపురంలో సమావేశం ఏర్పాటుచేసి ఆశా వర్కర్లు ఉదయం ఆరు గంటలకు తినేసి రావాలని 100మీటర్ల దూరంలో ఒకరు వుండాలని, తినుబండారాలు, వాటర్ బాటిల్స్ ఎవరికివారే తెచ్చుకోవాలని చెప్పడం చాలా దారుణమన్నారు. ఇలాంటి రాజకీయ సభల్లో ఆశా కార్యకర్తలకు ఏమైనా జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు.

నవచైతన్య ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా ర్యాలీ

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలోని స్థానిక నవచైతన్య జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడమ్ రన్ 4.0 భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మారెమ్మ తల్లి గుడి నుంచి మాధవపురం రోడ్డు వరకు సాగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా శరీకరంగా బలంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపల్ తోట శ్రీనివాసు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి- రౌతులపూడి

మండలంలోని ఎస్.అగ్రహారంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ప్రతిపాడు ఎంఎల్‌ఎ పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, సర్పంచ్ ఎస్.శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం స్థానికంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని వైద్యులు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణమ్మ, జడ్‌పిటిసి సభ్యులు గొల్లు లక్ష్మణమూర్తి, వైసిపి మండల అధ్యక్షులు శ్రీను, డిసిసిబి డైరెక్టర్ పులి మధు, ఎంపిడిఒ గోవింద వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

కళ్లజోళ్లను అందిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

12 మందికి కళ్లజోళ్ల పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జడ్‌పి బాలికల పాఠశాల విద్యార్థులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించి 12 మందికి కళ్ల జోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు, శంకర్ నేత్రాలయ వైద్యుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించిన అవసరమైన వారికి కళ్ల జోళ్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నాయకులు ఎడివి.ప్రసాద్, ఊర శ్రీను, కప్పల నాగభూషణం, పోరా వెంకటేశ్వర్లు, ఉడతల రమణారావు, వి.రాజబాబు తదితరులు ఉన్నారు.

5వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

గణపతి నవరాత్రులు ముగింపును పురస్కరించుకుని సామర్లకోట లారీ స్టాండ్ కార్యాలయం వద్ద బుధవారం 5వేల మందికి అన్నదానం చేశారు. జనసేన పార్టీ పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జ్ తుమ్మల రామస్వామి, భారతమాత సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోరకపూడి చిన్నయ్య దొర పాల్గొని అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లారీ యూనియన్ ప్రతినిధులు,జనసేన పట్టణ అధ్యక్షులు సరోజ వాసు తదితరులు పాల్గొన్నారు.

కార్టూన్ 'నిజం'

కొనసాగుతున జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో నిర్వహించిన శిబిరంలో పాల్గొన్న ఎంఎల్‌ఎ జ్యోతుల

సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలో సచివాలయం -1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు మలకల సూరిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి పి.ప్రశాంత్, వైద్యులు లక్ష్మి, చైతన్యదీప్తి, సిహెచ్.భవ్యశ్రీ, హర్షవర్ధన్, శ్రీకాంత్ వైద్య సేవలు అందించారు. సొసైటీ అధ్యక్షులు మలకల వరాల బాబు, గ్రామ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ సత్య,జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్, ఐ.వెంకటరమణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పేదలకు అందిస్తున్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చలగళ్ళ దొరబాబు, ఎఎంసి చైర్మన్ జనపరెడ్డి బాబు, కందుల చిట్టిబాబు, సర్పంచ్ ములంపాక సురేష్, వైసిపి కాకినాడ జిల్లా జనరల్ సెక్రటరీ పోసిన బాబూరావు, ఎంపిడిఒ వెంకటరామన్, తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, వైద్యులు సౌమ్య, కార్యదర్శి తరంగిణి పాల్గొన్నారు.

కరప మండలం పాతర్లగడ్డ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్షను సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై.సుబ్బారావు, వైసిపి మండల అధ్యక్షులు డైరెక్టర్ చింత ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌నాయక్, మెడికల్ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎజగ్గంపేట రూరల్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చడమే సిఎం జగన్ లక్ష్యమని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు అన్నారు.కాట్రావులపల్లి లో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిట్ట సుగుణరావు, వైసిపి నాయకులు ఒమ్మి రఘురామ్, సూరిమిల్లి రాంబాబు, ఎంపిడిఒ వసంత్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

డాబాపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

డాబా పై నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన కపిలేశ్వరపురం మండలంలోని వెదురుమూడి గ్రామంలో జరిగింది. అంగర పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుత్తుల దుర్గాప్రసాద్ (38) మంగళవారం అర్ధరాత్రి నిద్రమత్తులో పిట్టగోడను గుద్దుకుని కింద పడిపోయాడు. అతని భార్య పద్మ ఫిర్యాదు మేరకు అంగర హెచ్‌సి విశ్వేశ్వరరావు బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని చిలకపాడులో గత నెల 19న జరిగిన దాడి సంఘటనలో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. పాత కక్షల నేపథ్యంలో చిలకపాడు గ్రామానికి చెందిన చింతపర్తి మంగరాజుపై కలిపే ప్రసాదు తన కొడుకు కలిపే ఐవాన్ రాజు కలిసి గత నెల 19వ తేదీ రాత్రి ఇనుప రాడ్‌తో దాడి చేశారు. ఈ దాడిలో బాధితుడి రెండు కాళ్లు విరిగిపోయాయి. ఈ సంఘటనపై బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి, దాడికి కారకులైన ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసి తణుకు కోర్టులో ప్రవేశపెట్టగా వారికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రామరావు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - పెరవలి

పెరవలి-'కాపవరం గ్రామాల పరిధిలో రెండు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 15 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.22,290 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

40 కాసుల బంగారం పోయిందని ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

40 కాసులు బంగారం కల్గిన ఒక బ్యాగ్ ఆటోలో ప్రయాణిస్తుండగా పడిపోయిన సంఘటన బుధవారం సీతానగరంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం గ్రామానికి చెందిన అడబాల అనుపమ తిరుపతి వెళ్లే క్రమంలో తన ఇంటిలో ఉన్న 40 కాసుల బంగారాన్ని ఒక బ్యాగులో పెట్టుకుని ఆటోలో రాజమహేంద్రవరం బయలుదేరారు. అయితే సీతానగరం నుంచి రఘుదేవపురం వెళ్లేసరికి బంగారం పెట్టిన బ్యాగు కన్పించలేదు. దీంతో ఆమె సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి వెళ్లా ఆ బంగారాన్ని రాజమహేంద్రవరంలో ఉన్న బంధువుల ఇంటిలో భద్రపరిచి అటునుంచే తిరుపతి వెళ్లేందుకు బంగారాన్ని తీసుకెళ్తున్నట్లు ఆమె పోలీసులకు వివరించారు. బంగారం విలువ సుమారు రూ.20 లక్షల వరకూ ఉంటుందని అంచనా.

రోడ్డు ప్రమాదం ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి-బిక్కవోలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఈసంఘటన నెల్లూరు జిల్లా బోగోలు మండలం, కడనూతల జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శేఖం బాబు సమాచారం మేరకు.. మతులు సుబ్బరాజు(65) నిడమర్రు గ్రామం, వెస్ట్ గోదావరి జిల్లా, రామానాయుడు(65) వేమూలూరు గ్రామం, కొవ్వూరు మండలం, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారు. వారి గ్రామాల నుంచి తిరుమలకు నడుచుకుంటూ బయల్దేరారు. బుధవారం మధ్యాహ్నం నెల్లూరు జిల్లా బోగోలు మండలం, కడనూతల చెరువు కట్ట వద్ద రోడ్డు పక్కన కూర్చుని సేద తీరుతున్నారు. చెన్నయ్ నుంచి ఒంగోలు వైపు వెళుతున్న లారీ అతివేగంగా పక్కనే ఆగి ఉన్న లారీని గుద్దింది. అక్కడ కూర్చున్న వారిద్దరిపై నుంచి లారీ ఎక్కడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరు కున్నారు. మతదేహాలను కావలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంఎల్‌సి ఇజ్రాయిల్

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక మెడికల్ కళాశాల

ప్రజాశక్తి-అమలాపురం

ప్రతి పార్లమెంట్ నియోజకవర్గానికి 2026-27 ఏడాది నాటికి ఒక మెడికల్ కాలేజీ అందుబాటులోకి రానున్నదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు బుధవారం అల్లవరంలో సుమారు రూ.మూడు కోట్ల 90 లక్షలతో కార్పొరేటర్ దీటుగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి విశ్వరూప్, ఎంఎల్‌సి బొమ్మి ఇజ్రాయిల్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ మండలంలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణం మూలంగా తీర ప్రాంత గ్రామ ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బెండమూర్లంకలో ఆర్‌బికె ప్రారంభం

అల్లవరం మండల పరిధిలోని బెండమూర్లంక గ్రామంలో సుమారు రూ.24 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి పినిపే విశ్వరూప్, శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, ఎఎంసి చైర్ పర్సన్ డోలామణి రుద్ర, కె.బాపూజీ, ఎంపిపి యిళ్ళ శేషారా వు, జెడ్‌పిటిపి సభ్యురాలు కె.గౌతమి తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్, ఆర్ఎఒ మునిస్వామి

అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - యానాం

యానాం పరిధిలోని పిడబ్ల్యూడి నిధులతో చేపట్టబోయే పలు అభివద్ధి కార్యక్రమాలకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కనకాలపేటలో వాటర్ స్టోరేజ్ సంపునకు, గోపాల్‌నగర్ అంబేద్కర్ విజ్ఞాన్ భవన్‌లో టాయిలెట్స్ నిర్మాణానికి, అంబేద్కర్ విగ్రహానికి మెట్ల నిర్మాణానికి, గోపాల్‌నగర్ వాటర్ ప్లాంట్ అభివృద్ధి పనులకు, కామరాజ్ నగర్‌లో సిసిరోడ్డుకు, మెట్టకూరులో వాటర్ వర్క్స్ పనులకు, రక్ష హరికృష్ణ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి, ఎంజిజిబిహెచ్ స్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, ఎస్‌టిపిపి జూనియర్ కాలేజిలో ల్యాబులు, ఇతర నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. టైడల్ లాక్ నుంచి శివం బాత్ వరకు వాక్ వే నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, పిడబ్ల్యూడి ఇఇ వీరసెల్వం, ఎఇ కాళ్ల నాగరాజు, సిఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి, నాయకులు పాల్గొన్నారు.

యానాంలో అన్నదానం

ప్రజాశక్తి - యానాం

యానాం పిల్లారాయ స్వామి వినాయక చవితి బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పాల్గొన్నారు. స్వయంగా భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో స్థానికులతో పాటూ చుట్టుపక్క గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విద్యుత్ భారాలపై సిపిఐ ఇంటింటా ప్రచారం

రాజమహేంద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారాలపై సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని 29, 30 వార్డుల్లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. సిపిఐ నాయకులు వి.కొండలరావు, కుండ్రపు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వం పెంచిన విద్యుత్ ధరలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు ప్రతినెల క్రమక్రమంగా పెరగడంతో ప్రజలు ఇబ్బందులకు పడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా ప్రజలపై భారాలు వేస్తూ దోపిడీకి పాల్పడు తున్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సప్ప రమణ, యడ్ల లక్ష్మి ,సేపని రమణమ్మ, పి.దేముడు, వెంకటరావు పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి డాక్టరేట్

కాకినాడ : కాకినాడ శ్రీరామ్ నగర్ ప్రభుత్వ పాఠశాల ఎఎఫ్‌సి స్కూల్ ఉపాధ్యాయుడు ఎవిఎస్ఎన్.కృష్ణమూర్తికి జెఎన్‌టియుకె డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. రసాయన శాస్త్రంలో 'ద్రవరూప స్ఫటికాలు' అనే అంశంపై దక్షిణమూర్తి ఆధ్వర్యంలో సమర్పించిన పరిశోధనా వ్యాసానికి ఈ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా సహచర ఉపాధ్యాయులు నేతల నూకరాజు, ఎస్‌జి.రామకృష్ణ, అర్జునరావు, సూర్యకుమారి, మౌని, సూర్యనారాయణ అనురాధ, బి.పద్మావతి, పి.పద్మావతి, అప్పారావు పిఎంసి సభ్యులు తాతారావు, కాజా మొహిద్దీన్, బుడితి విజయలక్ష్మి, రమణ నాగబాబు, చందు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

పెద్దాపురంలో అవగాహనా ర్యాలీ దృశ్యం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీ వీర్రాజు హైస్కూల్లో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కెవి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాలికలు పోషకాహారం తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టం, బాల్య వివాహాల వల్ల నష్టాలు, లింగ వివక్షత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పద్మ, స్నేహ, జ్యోతి, తులసి, గౌరీ, దుర్గాదేవి, మాధవి, అమ్మాజీ, మంగ, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులే వారి భవితకు చుక్కాని

కాకినాడ అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఉమెన్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కాకినాడలోని మహర్షి బులుసు సాంబమూర్తి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికలపై లైంగిక దాడులు,

కాకినాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ లక్ష్మి

అఘాయిత్యాల నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. ఉమెన్ ఎంపవర్మెంట్ ట్రస్ట్ ఛైర్ పర్సన్ సత్య మలిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యమానికి ముఖ్య అతిథిగా సిడిపిఒ వై.లక్ష్మి హాజరై మాట్లాడారు. కౌమార దశలో బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.రామలక్ష్మి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దళిత గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఈశ్వరరావు బృందం

సిపిఎం దళిత సదస్సుకు తరలి రావాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సిపిఎం ఆధ్వర్యంలో దళిత సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయ విధానాలు అనే అంశంపై ఈ నెల 15న కాకినాడ సూర్య కళా మందిరంలో నిర్వహించే రాష్ట్ర దళిత సదస్సుకు తరలిరావాలని ఆ పార్టీ మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు కోరారు. ఇప్పటికే మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో దళిత ప్రాంతాలను సందర్శించి కరపత్రాలు పంచామన్నారు.. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు మూడు బృందాలుగా ఏర్పడి ప్రచారం చేశామని అన్నారు. ఈ ప్రచారంలో దుప్పి అదృష్టదీపుడు, ఎం.తణుకురాజు, ఎన్.త్రిమూర్తులు, వి.శ్రీనివాస్, పి.గోపాలకృష్ణ, వడ్డి ఏడుకొండలు, ఎస్. సత్యనారాయణ, బీర శ్రీనివాస్, తాడి నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హోంమంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మండలంలోని బల్లిపాడు కాకర్ల రామయ్య కళ్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్య క్రమంలో హోం మంత్రి తానేటి వనిత, జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధ వీలత పాల్గొన్నారు. పలువురు నుంచి వినతిపత్రాలను అందు కున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతోపాటు ప్రజలు ఎదు ర్కొంటున్న సమస్యలను వారి అవసరాలను పరిష్కరించడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజల కంటే పార్టీ నాయకులే తమ సమస్యలను అర్జీల రూపంలో మంత్రికి అంద జేశారు. కార్య క్రమంలో ఎంపిడిఒ రమణ, తహ శీల్దార్ టి.రాధిక, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో సోలార్ లైట్ల ఏర్పాటు

ప్రజాశక్తి -కరప

కరపలోని ప్రధాన కూడళ్లలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నెట్ క్యాఫ్ డైరెక్టర్ సాదే విజయలక్ష్మి తెలిపారు. బుధవారం కరపలో వివిధ చోట్ల 9 లైట్లు ఏర్పాట్లకు పాయింట్లు గుర్తించామన్నారు. నెట్‌క్యాఫ్ కాకినాడ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.సత్యనారాయణ, డైరెక్టర్ సాదే విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ సిఎం ఆదేశాలతో రాష్ట్రంలో సోలార్ విద్యుత్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వీటిలో హైడల్ పవర్, విండ్ పవర్, సోలార్ పవర్, ఇలా ఆంధ్రప్రదేశ్ ప్రకృతి ఇంధన వనరుల సంస్థ చేపట్టిందన్నారు. గృహాలకు 40 శాతం రాయితీ కల్పిస్తుందన్నారు. రైతులు తమ తోట పంటలను కోతులు బెడద నుంచి రక్షించుకునేందుకు సోలార్ ఫెన్సింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రైతులకు సోలార్ పంపు సెట్లకు విద్యుత్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఉద్యోగులకు సోలార్ ఛార్జింగ్ బైకులను ఫైనాన్స్‌పై సంస్థ అందిస్తుందన్నారు. వీటిని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో ప్రారంభిస్తామన్నారు.

సాదే విజయలక్ష్మికి మొక్క అందజేస్తున్న నెట్‌క్యాఫ్‌కాకినాడడిస్ట్రిక్ట్‌మేనేజర్

బివి.లంకలో గడప..గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమనిప్రభుత్వ విప్, ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బడుగువానిలంకలో ఆయన ఆధ్వర్యంలో సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన గడప.. గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిర్ల మాట్లాడుతూ ఈ నాలుగున్నరేళ్ల కాలంలో మొత్తం ఈ ఒక్క గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల రూపంలో రూ.12, 91,51,758 లబ్ధి చేకూర్చామన్నారు. ఇంకా అర్హులైన పేదలకు లబ్ధిదారులుగా చేసి సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. సిఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసిన నాటి నుండి పార్టీ, కులం, మతం, ప్రాంతం, వర్గం ఇవేమీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అందరికీ అందించారని సంక్షేమ పథకాలు అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎఎంసి ఛైర్మన్ వై.నాగేశ్వరరావు, నేతలు తోరాటి రాంబాబు, కటారి గంగరాజు, ఉప సర్పంచ్ పినమాల జ్యోతి తాతాజీ, కార్యదర్శి సుప్రియ, డిటి జానకిరామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలకు హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

జనుపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యత, బాలికా విద్య ప్రాముఖ్యత, సమాజంలో బాలికల పాత్ర, మహిళల పాత్ర,పోషణ, రక్తహీనత, బాల్యవివాహాల నిర్మూలన వంటి విషయాలపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యాప్తికి పలు సంస్కరణలను అందు బాటులోకి తెచ్చిందని, ఆయా అవకాశాలను సద్వినియోగపరుచుకుని బాలికలు ప్రగతి పథంలో పయనించాలని ఆమె సూచించారు. కార్యక్రమం లో స్థానిక పాఠశాల సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, ఎఎస్ కె.సత్యవాణి, ఎన్ఎం .సత్యశ్రీ, దీపిక, సిహెచ్ఒ వి.సుజాత, ఆశ వర్కర్స్, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జనుపల్లి లో విద్యార్థినులతో మాట్లాడుతున్న బి.అనంతలక్ష్మి

తాగునీటి పైప్‌లైన్ విస్తరణకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఐ.పోలవరం

తిళ్లకుప్పలోని జగనన్న హౌసింగ్ కాలనీకి రూ.18.90 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో మంచినీటి వాటర్ పైపులైన్ విస్తీర్ణ పనులకు సర్పంచ్ కడియం తమ్మయ్య ఆధ్వర్యంలో ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి సమక్షంలో జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పిన్నమరాజు వెంకటపతిరాజు, జిల్లా జనరల్ సెక్రెటరీ మోకా రవి, వైస్ ఎంపిపి పిన్నమరాజు సత్యనారాయణ రాజు, తిళ్లకుప్ప, కేశనకుర్రు సొసైటీ అధ్యక్షులు ఉండ్రు వెంకటేశ్వరరావు, ఇందుకూరి రంగరాజు, ఉండ్రు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి సభ్యులుప సతీష్

అవగాహన కల్పిస్తున్న ఎంపిహెచ్ ఇఒ బిషప్

వివాహ వయసుపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలోని మాచర జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్లస్ లో బుధవారం వివాహ వయసుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు . పాఠశాల హెచ్ఎం రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ బిషప్ మాట్లాడుతూ యుక్త వయసు వచ్చిన ప్రతి విద్యార్థిని వివాహ వయసు పై అవగాహన కలిగి ఉండాలన్నారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వివాహ వయసు, లింగ నిర్ధారణపై అవగాహన కల్పించి, ప్రయోజనాలను వివరించారు. అలాగే లింగ నిర్ధారణపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండి పౌష్టికాహారం తీసుకోవలసిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో వాకతిప్ప పిహెచ్‌సి ఎంఎహెచ్ఇఒ బిషప్, ఎంఎహెచ్ఎస్ కామేశ్వరరావు, సిహెచ్ఒ శ్రావణి, ఎఎన్ఎం గాయత్రిదేవి, ఉపాధ్యాయ సిబ్బంది వెంకట్, విశ్వనాథ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పడమర ఖండ్రికలో ఉపాధి పనులపై చర్చిస్తున్న జెఇ సుబ్రహ్మణ్యం

ఉపాధి పనుల ప్రణాళిక వెల్లడి

ప్రజాశక్తి కపిలేశ్వరపురం

పడమర ఖండ్రిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తిరునాతి ఆదిలక్ష్మి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఉపాధి గ్రామ సభలో ఎన్ఆర్ఇజిఎస్ జెఇ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామంలో చేపట్టవలసిన ఉపాధి పనుల ప్రణాళిక నివేదికను గ్రామ సభలో వివరించారు. గ్రామంలో పనులు చేపట్టుటకు చర్చలు జరిపారు. గ్రామ పరిదిలో చేపట్టబోయే పంట కాలువల పూడికతీత, చెరువులు, మట్టి రోడ్ల నిర్మాణం పనులకు సంబంధించి 66 పనులను గుర్తించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ నేల వీర వేణి తెలిపారు. గుర్తించిన పనుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు జెఇ సుబ్రహ్మణ్యం తెలిపారు. సమావేశంలో నేల సూర్య ప్రకాశరావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్ .సునీతా వీరవేణి, ఉపాధిమేట్లు, రైతులు, పాల్గొన్నారు.

పంట కాలువలో వ్యర్థాల తొలగింపు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పంట కాలువల్లో వ్యర్థాలు రోజురోజుకూ పెరిగిపోవడంతో పంటచేలకు సాగునీరు అందక రైతులు పలు ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా కె.గంగవరం మండలంలోని శివల కాలువ కుడుపూరు వెళ్లే కాలువలో వ్యర్థాలు పెరిగిపోయాయి. వీటిని నీటిపారుదల శాఖ అధికారులు, ప్రొక్ లైనర్ పెట్టి మరి తీయని రాసిన పరిస్థితి ఏర్పడింది. కుడుపూరు వెళ్లే కాలవలో మందుబాబులు తాగేసి పడేసిన బ్రాందీ సీసాలు దొరకటం గమనార్హం. రాత్రి సమయంలో కాలువల గట్ల పైన మందుబాబులు మద్యం తాగి ఆ సీసాలన్నీ కాలువలో పడేశారు. దీంతో పంటకాలువ పూడుకు పోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పంట కాలవల్లో సక్రమంగా సాగునీరు అందడం లేదని ప్రజాశక్తిలో కథనం ప్రచురితమవడంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు యంత్రాల సాయంతో రెండు రోజులపాటు వ్యర్థాలను తొలగించారు. దీంతో ఆ కాలువల్లో సాగునీరు సక్రమంగా అందడంతో రైతుల సమస్య పరిష్కారమైంది. మందుబాబులు తాగిన మద్యం సీసాలు కాలువలో వేయకుండా రైతులు గమనించాలని ఇరిగేషన్ అధికారి సుజాత విజ్ఞప్తి చేశారు. కాలువల్లో వ్యర్థాలను తొలగించినందుకు, సమస్యను అధికారులు దష్టికి తీసుకు వెళ్లిన ప్రజాశక్తి దినపత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రొక్లెయిన్‌తో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

సవరణ

ది. 11-10-2023వ తేదీని గ్రంధి అప్పారావు తరపున దస్తావేజు పోయిన విషయమై ప్రచురింపబడిన ప్రకటనలో ది. 27-05-1982 తేదీ గల క్రియ దస్తావేజు పోయినది అని తెలియపరచడమైనది. సదరు **27-05-1982 తేదీ గల క్రియ దస్తావేజు డాక్యుమెంటు రిజిస్ట్రేషన్ నెం. 3616/1982** పోయినదిగ సవరించి చదువుకొనగలరు.

చల్లా దుర్గాప్రసాదరావు (నోటరీ)
చల్లా చంద్రశేఖర్
రాజమండ్రి అడ్వకేట్స్, ఇన్నీసుపేట
ది.11-10-2023 రాజమండ్రి-533101

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, శంఖవరం మండలం, నెల్లిపూడి గ్రామ కాపురస్తురాలు పల్లేటి మేరీకుమారి, భర్త: రాజు అను నా యొక్క పాస్‌పోర్టు నెంబర్ **N4650478** ది. 22-09-2023వ తేదీన నెల్లిపూడి గ్రామం నుండి అన్నవరం ఆటోలో ప్రయాణిస్తుండగా మార్గ మధ్యంలో నా యొక్క పాస్‌పోర్టు పోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు తెలియజేయగలరు.

పల్లేటి మేరీకుమారి
భర్త: రాజు, నెల్లిపూడి గ్రామం
శంఖవరం మండలం, కాకినాడ జిల్లా
సెల్: 8179128557

In The Court Of The Principal Junior Civil Judge :: Kakinada
O.S.No. 1156/2021

Between:
State Bank of India Retail Assets, Small & Medium Enterprises Center, Kakinada, Rep. by its Authorized Signatory Chilukoti Venkata Sivanaga Kumar. ***...Plaintiff***
AND
Talari Ashokbabu ***...Defendant***
TO:
Talari Ashokbabu, S/o. Raju, Hindu, Aged 29 Years, Business, D.No. 14-1-28/6, Vallabhai Street, Ramakrishna Rao Peta, Kakinada.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.30-10-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.వి.ఎస్.వి.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, కాకినాడ.
సెల్: 98662 11196

In The Court Of The 5th Additional Junior Civil Judge :: Kakinada
O.S.No. 281/2023

Between:
Malireddy Bhuchakram ***...Plaintiff***
AND
Mudugu Ananda Rao ***...Defendant***
TO: Defendant:
Mudugu Ananda Rao, S/o. Narayana Murthy, Business, Aged 43 Yrs, D.No. 4-19, Kotha Manjeru, Kajuluru Mandal, Kakinada District.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.03-11-2023వ తేదీకి వాయిదా వేసినారు. ఆరోజు ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.విశ్వేశ్వర దేశి
అడ్వకేట్, అశోక్ నగర్, కాకినాడ.
సెల్: 94402 62977

In The Court Of The VIth Addl. District Judge :: Kakinada
G.O.P.No. 62/2023
(In The Matter of Sale of Minor's Property by Guardian)

Between:
Pragada Naga Mani ***...Petitioner***
AND
Nill ***...Respondent***

పై నెంబరు పిటీషనులో పిటీషనరు గారు యొక్క మైనరు కుమార్తె అయిన ప్రగడ పూజ, వయస్సు 16 సం||లు మరియు మైనరు కుమారుడు అయిన ప్రగడ సంజయ్, వయస్సు 14 సం||లు గార్ల చదువు ఇతర ఖర్చుల నిమిత్తం ఈ దిగువ షెడ్యూలు దాఖలా 1/3వంతు ఆస్థిని అమ్ముటకు పర్మిషను ఇప్పించమని కోరుచూ పై కోర్టు వారి ఎదుట పిటీషను దాఖలు చేసినారు. కావున ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల **ది.01-11-2023వ తేదీన ఉదయం గం|| 10:30 ని||లకు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను.**

Schedule: East Godavari District, Kakinada Rural Mandal, Sarpavaram Sub Registry, Vakalapudi Gram Panchayat, Vakalapudi Village, S.No. 138/4, 186/1B an extent of Ac.20-85 cents of land got divided into house sites vide L.P.No. 5/1985 in the name of Vinayaka Nagar, Plot No. 200, as per endorsement of Tahsildar, Kakinada Rural Mandal, S.No. 186/1B1, Plot No. 200 Part-1 an extent of 210 Square Yards, Part-2 an extent of 68 Square Yards in total an extent of 278 Square Yards Part-1 an extent of 210 Square Yards Norhern side an extent of 102.66 Square Yards or 85.83 Square Yards of vacant site bounded by: ***East:*** 22.0 feet or 6.70 Mts Site in this plot part-2 of Kola Siva Kamakshi. ***West:*** 22.0 feet or 6.70 Mts 30 feet width Road. ***North:*** 42.0 feet or 12.80 Mts 30 feet width Road. ***South:*** 42.0 feet or 12.80 Mts Site in this Plot Part-1 of Putta Sireesha.

Within the above boundaries, an extent of 102.66 Square Yards of 85.83 Square Meters of Vacant Site with all easementary rights etc.

కె.వి.ఎస్.వి.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, కాకినాడ.
సెల్: 98662 11196